క్లుప్తంగా

పల్లె ప్రకృతి వనం దగ్ధం

నూతనకల్ : కొత్తతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదైంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో 1200మొక్కలను పెంచుతున్నారు. మొక్కల మధ్య ఎండిన గడ్డిని తొలగించకపోవడం వల్ల మంటలు పెద్ద ఎత్తున వ్యాపించి ప్రకృతి వనం పూర్తి కాలిపోయిందని తండావాసులు తెలిపారు. ప్రకృతి వనం కాలిపోవడం అధికారుల పర్యవేక్షణ లోపమేనని ప్రజలు అంటున్నారు.

24న కేటీఆర్ సభ

తుంగతుర్తి : తిరుమలగిరి మండల కేంద్రంలో ఈ నెల 24న జరిగే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమలగిరిలో జరిగే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తుంగతుర్తి : త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాంప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డానియల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మొర్సకుంట తండాకు చెందిన భూక్యా రవీందర్, నూనావత్ రాములు, లింగాల గ్రామానికి చెందిన లొడంగి పద్మలు ఇటీవల మృతి చెందారు. శనివారం మృతుల కుటుంబాలను టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, హుస్సేన్, శివనాయక్, గబ్రు, లచ్చు, జూకూరి గాంధీ, గార్లపాటి వెంకట్‌రెడ్డి, మామిడి చంద్రం పాల్గొన్నారు.

రామయ్యకు నివాళి

భానుపురి : జవహర్ బాల కేంద్రం వ్యవస్థాపకుడు, స్పందన శరీర అవయవదాన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీవీ రామయ్య శనివారం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. దీంతో ఆయన మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్, వాసవీ క్లబ్, స్పందన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అలాగే వీవీ రామయ్య బాల్య మిత్రుడు, మంత్రి జగదీశ్‌రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి, స్పందన అవయవదాన సంఘ ప్రస్తుత అధ్యక్షుడు గుండా రమేష్, కార్యదర్శి కోటయ్య, కార్యవర్గ సభ్యులు బండారు రాజా, తోట శ్యాం ప్రసాద్, కోటీశ్వరి, పానుగోటి నిర్మల, పురుషోత్తం తదితరులు నివాళులర్పించారు. కాగా సిద్దిపేటకు చెందిన సురభి మెడికల్ కళాశాలకు వీవీ రామయ్య పార్థివదేహాన్ని అప్పగించారు.

రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి

తిరుమలగిరి : రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్దఎత్తున పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ కోరారు. శనివారం మున్సిపల్ కేంద్రంలో ఆన్‌లైన్ క్విజ్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎంఆర్‌సీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాల లక్ష్మి, పీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం, పీసీసీ సభ్యులు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనుల పరిశీలన

ఆత్మకూర్ (ఎస్) : బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ నర్సింహ అన్నారు. నసీంపేట సమీపంలోని లోలెవల్ బ్రిడ్జి వద్ద చేపడుతున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని, వర్షాల సీజన్ కావడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ యాకూబ్, డీఈ పవన్, ఏఈ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

26, 27, 28 తేదీల్లో శిక్షణ తరగతులు

దురాజ్‌పల్లి : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపగాని రవికుమార్, నరేష్ కోరారు. శనివారం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తూ విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. శిక్షణ తరగతుల్లో ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్, శివప్రసాద్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మించరూ..

- తొండ గ్రామంలో అండర్‌పాస్ లేక తరచూ ప్రమాదాలు
- గ్రామం మీదుగా నూతనంగా ఏర్పాటుకానున్న జాతీయ రహదారి
- ప్రమాదాలు మరింతగా పెరుగుతాయని గ్రామస్తుల ఆవేదన
- రోడ్డు విస్తరణలోనైనా అండర్‌పాస్ నిర్మించాలని వేడుకోలు


తొండ గ్రామంలో అండర్‌పాస్ నిర్మించాల్సిన ప్రదేశం

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామం మీదుగా వెళ్తున్న రహదారికి గ్రామంలో అండర్‌పాస్ లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారికి రెండు వైపులా గ్రామం విస్తరించి ఉన్నది. బస్టాండ్ సమీపంలో రెండు వైపుల నుంచి వాహనాలు, పశువులు, జనాలు, పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ రహదారిపై వేగంగా వెళుతున్న వాహనాలతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కొందమంది ప్రాణాలు కూడా కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డు దాటాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించే పరిస్థితి లేదు. వాహనదారులు, పాదచారులు నిత్యం భయంభయంతో రోడ్డు దాటుతున్నారు. దీనికి తోడు గౌరెల్లి నుంచి (ఓఆర్ఆర్) భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఉమ్మడి నల్లగొండ వలిగొండ జంక్షన్ నుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రోడ్డు వరకు ఫేస్–1 కింద రోడ్డు విస్తరించేందుకు రూ.549 కోట్లతో పనులు నడుస్తున్నాయి. దీంతో తొండ గ్రామంలోని రహదారిని విస్తరించనున్నారు. నేషనల్ హైవేగా విస్తరిస్తే వాహనాలు ఇంకా అధిక స్పీడుతో వెళుతుంటాయి. కనీసం రోడ్డు విస్తరణలోనైనా తొండ గ్రామం వద్ద అండర్‌పాస్ నిర్మించాలని, లేదంటే ప్రమాదాలు మరింతగా పెరుగుతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామసభలో తీర్మానం చేశాం



బస్టాండ్ సమీపంలో రోడ్డు క్రాసింగ్ ప్రమాదకరంగా ఉంది. రహదారిని దాటేందుకు అండర్‌పాస్ నిర్మించాలి. ఈ మేరకు గ్రామ సభలో తీర్మానించాం. త్వరలో అధికారులను కలుస్తాం.

– ఎస్.శాతవాహనరావు, సర్పంచ్, తొండ

అండర్‌పాస్ నిర్మించాలి



బస్టాండ్ సమీపంలో రెండు వైపుల నుంచి ఒకేసారి రోడ్డు మీదకు వాహనాలు, జనం వస్తారు. ఇక్కడ అత్యంత ప్రమాదకరంగా ఉంది. రోడ్డు దాటాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి అండర్‌పాస్ నిర్మించాలి.

– అనంత్, తొండ గ్రామస్తుడు

నేడు మంచినీళ్ల పండుగ


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్లలో మిషన్ భగీరథ ప్లాంట్ ఆవరణంలో ఆదివారం నిర్వహించే మంచినీళ్ల పండుగను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ప్రతి ఇంటికి నీటిని అందిస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, పన్నాల మల్లారెడ్డి, సురేందర్ నాయక్, బత్తుల విద్యాసాగర్, బిక్కి బుచ్చయ్య, బద్దం ప్రశాంత్‌రెడ్డి, బత్తుల సాయిలుగౌడ్, బత్తుల విజయ్, కనకటి మహేష్, యాస ఎల్లారెడ్డి, కొచ్చర్ల బాబు, రేసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

భానుపురి : సూర్యాపేట పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 8గంటల నుంచి ద్వారతోరణ ధ్వజకుంభ ఆరాధనలు, మూలవరులకు చతుస్థానార్చన, 9గంటలకు శార్దూల వాహన సేవ, 10గంటలకు మహాపూర్ణాహుతి, ఉత్సవాంత స్నపనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సీహెచ్.వెంకటనారాయణ, ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాలు

అర్వపల్లి : సూర్యానాయక్‌తండా గ్రామపంచాయతీ ఆవాసం వీర్యానాయక్‌తండాలో రెండు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాలు శనివారంతో ముగిసాయి. జలాభిషేకం, నిర్వహించి పూజాదికాలు జరిపారు. వేడుకల్లో ఉత్సవ నిర్వాహకులు, తండా గిరిజనులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలపై ఉపా కేసులు సిగ్గుచేటు

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉద్యమకారులు, పౌరహక్కుల నేతలు, మేధావులపై తెలంగాణ ప్రభుత్వం ఉపా చట్టం కింద దేశద్రోహం కేసులు పెట్టడం సిగ్గుచేటని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. శనివారం తుమ్మలపెన్‌పహాడ్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నియంతృత్వ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే 152 మంది మేధావులపై ఉపా కేసులు నమోదు చేయడం ప్రభుత్వ అభద్రతా భావానికి నిదర్శనమన్నారు. మరణించిన వారిని, జైల్లో ఉన్న వారిని సైతం ఈ కుట్ర కేసులో నమోదు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. మావోయిస్టు నాయకుడి డైరీలో పేర్లు ఉన్నాయని ప్రొఫెసర్ హరిగోపాల్, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, అరుణోదయ నాయకురాలు విమలక్క, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, నారాయణరావులతోపాటు 152 మందిపై పెట్టిన ఉపా కేసులను తక్షణమే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి కునుకుంట్ల సైదులు, రవి, వీరబోయిన రమేష్, బోనగిరి గిరిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపా కేసులను ఎత్తివేయాలి

అర్వపల్లి : ప్రొఫెసర్‌లు ఖాసీం, హరగోపాల్, అరుణోదయ సాంస్కృతిక ఉద్యమ నాయకురాలు విమలక్క, మహిళా ఉద్యమ నాయకురాలు సంధ్యతో పాటు 152 మందిపై మోపిన ఉపా కేసులను వెంటనే ఎత్తివేయాలని సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా అధ్యక్షుడు దడిపల్లి వెంకట్ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాలుగా ప్రజలతో మమేకమై వారు పోరాడారని చెప్పారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలిచి ప్రజాగొంతుకలుగా ఉద్యమిస్తున్న వారిపై కేసులు మోపడం శోచనీయమన్నారు. వెంటనే వారిపై మోపిన ఉపా కేసులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలని వినతి


తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

తిరుమలగిరి : కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తిదారులకు ఆర్థికసాయం పథకం అప్లికేషన్ల సర్టిఫికెట్ల కోసం ఆశావహులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. తిరుమలగిరి మండల కేంద్రంలో ఒక్కటే మీ సేవ కేంద్రం ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మరిన్ని మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, తహసీల్దార్ కార్యాలయం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోషా, పున్నం, వెంకట్‌రెడ్డి, అశోక్, సోమయ్య, సైదులు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు పాతిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూర్ (ఎస్) : పొలంలో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయని, విద్యుత్ స్తంభాలు పాతాలని ఓ రైతు డీడీ కట్టి ఆరునెలలైనా అధికారులు స్పందించకపోవడంతో ఈ నెల 14న సాక్షిలో ప్రచురితమైన విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. శనివారం మండల పరిధిలోని కాశీగూడెంలో బాధిత రైతు మైబెల్లి పొలంలో రెండు స్తంభాలను పాతి తీగలు బిగించారు. ఈ సందర్భంగా రైతు మైబెల్లి మాట్లాడుతూ విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉండడంతో ప్రాణాలు అరచేత పట్టుకొని వ్యవసాయ పనులు చేసుకోవాల్సి వచ్చిందని, సాక్షి కథనంతో అధికారులు స్పందించి స్తంభాలు పాతడం సంతోషంగా ఉందన్నారు.


నూతనంగా పాతిన స్తంభం

రూ.లక్ష సాయం పథకం దరఖాస్తుకు పాట్లు


తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తున్న లబ్ధిదారులు

తిరుమలగిరి/అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల వృత్తిదారులకు అందించే ఆర్థిక సహాయానికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రాలు లబ్ధిదారులతో కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. దరఖాస్తులకు తక్కువ రోజులు ఉండటం, సర్వర్ బిజీ వంటి కారణాలతో ప్రక్రియ జాప్యం అవుతుండటంతో దరఖాస్తుదారులు బారులుదీరుతున్నారు. అయితే 2021–22, 2022–23 సంవత్సరంలో మంజూరైన ఆదాయ ధ్రువపత్రం ఉన్నా సరిపోతుందని, కొత్తది అవసరం లేదని చెబుతున్నా దరఖాస్తుల దారులకు అవగాహన కరువైంది. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తుదారులు మాట్లాడుతూ గడువు తేదీ పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నూతనకల్ : నూతనకల్ మండల కేంద్రంలో ప్రభుత్వ మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం నాయబ్ తహసీల్దార్ శ్రీధర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో గిరిజన, దళిత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి లక్షలు వెచ్చించి చదువుకోలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మోడల్, గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సంపత్, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

18నుంచి సంస్మరణ సభలు

అర్వపల్లి : సాయుధ రైతాంగ ప్రతిఘటన పోరాట విప్లవోద్యమ నేతలు ఎంపీ ప్రసాద్–వసంతక్కల సంస్మరణ సభలను ఈ నెల 18 నుంచి 30 వరకు గ్రామ గ్రామాన నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్దా సత్యనారాయణ శనివారం తెలిపారు. అర్వపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసాద్–వసంతక్కల వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభలను నిర్వహించడంతో పాటు ఈ నెల 18న కాకినాడ జిల్లా నెల్లిపూడిలో 18వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సంస్మరణ, వర్ధంతి సభలను జయప్రదం చేయాలని కోరారు.

సృజన స్కూల్ ఎదుట ధర్నా

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న సృజన స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబోయిన లింగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ పాఠశాల ఎదుట బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సృజన పాఠశాలలో ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నారని అన్నారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేష్, అంజన్‌కుమార్, వంశీ, నగేష్, అంజన్, జై చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలో తండాలు అభివృద్ధి


సూర్యాపేట రూరల్: గిరిజనులతో కలిసి నృత్యాలు చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


ఆత్మకూర్(ఎస్) : దుబ్బతండాలో నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

సూర్యాపేట రూరల్ : సీఎం కేసీఆర్ పాలనలో గిరిజన తండాలు గ్రామ పంచాయతీలుగా అవతరించటంతో పాటు తండాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా శనివారం రాజనాయక్ తండాలో నిర్వహించిన గిరిజనోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలు చేశారు. వేడుకల్లో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌లు లూనావత్ అశోక్, ఎంపీటీసీలు లూనావత్ శాంతబాయి, సీడీపీఓ కిరణ్మయి, ఏపీఎం వెంకన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా శనివారం గిరిజన దినోత్సవాన్ని వివిధ గ్రామ పంచాయతీల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొండిచింత తండాలో రూ.20 లక్షల నిధులతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వివిధ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దూపటి అంజలిరవీందర్, ఎంపీడీఓ ఉమేష్‌చారి, సర్పంచ్‌లు మోహన్‌బాబు, జాటోతు రవి, దరావత్ మహేష్, కార్యదర్శులు సురేష్, సరళ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

తుంగతుర్తి : గిరిజన తండాలను, గూడాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండల పరిధిలోని సూర్యతండాలో జరిగిన గిరిజన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భీంసింగ్, సర్పంచ్ యాకునాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, నల్లు రామచంద్రారెడ్డి, గౌడిచర్ల సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమ్లాతండాలో గిరిజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డిలు మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత తండాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలనే లక్ష్యంతో గ్రామ పంచాయతీలుగా మార్చారని ఆయన తెలిపారు. అనంతరం తండాలో ర్యాలీ నిర్వహించి తండాకు చెందిన పెద్ద మనుషులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గుగులోతు శంకర్‌నాయక్, లావుద్యా నర్సింహ, ఎంపీడీఓ ఇందిర తదితరులు పాల్గొన్నారు.


మద్దిరాల : తూర్పుతండాలో ర్యాలీ తీస్తున్న తండావాసులు, ప్రజాప్రతినిధులు


తిరుమలగిరి : చింతలకుంట తండాలో గ్రామసభలో పాల్గొన్న గిరిజనులు

అర్వపల్లి : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రామన్నగూడెం, సూర్యానాయక్‌తండా, నాణ్యతండా గ్రామ పంచాయతీల్లో గిరిజనోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తండాల్లో గిరిజనులతో ర్యాలీలు నిర్వహించారు. పలువురు గిరిజనులను సన్మానించారు. భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో అభివృద్ధిపై చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీఓ ఉపేందర్‌రావు, సర్పంచ్‌లు రమావత్ పీరమ్మ, మాణిక్యం, ఉపసర్పంచ్ సుజాతసంజీవ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, కావ్య, ఏపీఓ ఉపేందర్, హెచ్‌ఎం చిప్పలపెల్లి ధర్మయ్య, వార్డుసభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం చినగారకుంట తండాలో గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత తండాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలనే లక్ష్యంతో గ్రామ పంచాయతీలుగా మార్చారని ఆయన తెలిపారు. అనంతరం తండాలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాలిబాయి, ఎంపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శి సతీష్, నగేష్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగ్ భండార్

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పడిన తండాల్లో భోగ్ భండార్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలతో అలరించారు. ఆయా తండాల్లో గిరిజనుల ఆరాధ్యదేవుడైన సేవాలాల్‌మహరాజ్‌కు, ఆంజనేయస్వామిలకు రొట్టెలు, బెల్లంతో నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, మంగమ్మమంగ్యానాయక్, లింగానాయక్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని తూర్పుతండా, చౌళ్ల తండా, భగవాన్ తండాలో తెలంగాణ గిరిజనోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరి : మొండిచింత తండాలో జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ


పెన్‌పహాడ్ : చినగారకుంట తండాలో ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


తుంగతుర్తి : సూర్యతండాలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు


అర్వపల్లి : రామన్నగూడెంలో ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు, ప్రజాప్రతినిధులు


అర్వపల్లి : సూర్యానాయక్‌తండాలో..

21న ప్రత్యేక ప్రార్థనలు జరపాలి

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం స్పిరిచ్యువల్ డేగా ప్రకటించినందున జిల్లావ్యాప్తంగా ప్రతి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరపాలని టీఆర్ఎస్ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర నాయకుడు పూర్ణ శశికాంత్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని చర్చి కాంపౌండ్‌లో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ మామిడి శామ్‌సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి గెలుపు కోసం తమిళనాడులో ఉన్న వెల్లంకిని చర్చికి కిలోమీటర్ దూరం మోకాళ్లపై నడిచి ప్రార్థించి వచ్చిన పూర్ణ శశికాంత్‌ని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాప్టిస్ట్ కన్వెన్షన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రభుదాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.పౌలు, ఎలక్షన్ కమిటీ చైర్మన్ సాయిని జాకబ్, నియోజకవర్గ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్, పట్టణ అధ్యక్షుడు మీసాల ప్రభుదాస్, జనరల్ సెక్రెటరీ జడేవిడ్ రాజ్, రమేష్ బాబు, జనరల్ సెక్రెటరీ బొడ్డు మత్తయ్య, పేరాల రాజరత్నం, పల్స సజీవ, ఏసు పాదం, ఎజ్రా, సాల్మన్ రాజు, సునీల్, స్పర్జన్ రాజు, ప్రసన్న కుమార్, జాన్ పాల్, లేజర్, కోక యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

మేరు సంఘం కమిటీ ఎన్నిక

నాగారం : నాగారం మండల మేరు సంఘం కమిటీని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కీర్తి రాజు, ఉపాధ్యక్షులుగా కీర్తి లక్ష్మి, వీరన్న, బుచ్చయ్య, వాడపల్లి రంగమ్మ, మునగాల గౌరయ్య, ప్రధాన కార్యదర్శిగా కీర్తి సోమయ్య, కార్యదర్శులుగా కీర్తి లక్ష్మమ్మ, తాళ్ల నర్సయ్య, నాగయ్య, సోమయ్య, అరుణ, నిర్వాహక కార్యదర్శులుగా మునగాల శంకరయ్య, చిలకమ్మ, భాగ్యమ్మ, కోశాధికారిగా టి.సునీల్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

నాగారం : సూర్యాపేటలో ఈ నెల 24న జరిగే పీవైఎల్ 8వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి కునుకుంట్ల సైదులు కోరారు. శనివారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిర్వహిస్తున్న పోరాటంలో నిరుద్యోగ యువతి, యువకులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు గణేష్, ఉపేందర్, నర్సింగ లింగయ్య, కడారి సైదులు, కార్తీక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు